ప్రజాశక్తి

బుధవారం 19 నవంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మీరాబందలో లేఅవుట్



మీరాబంద చెరువులో వేసిన లేఅవుట్‌లో కొనసాగుత్ను డ్రెయినేజీ పనులు

- చురుగ్గా డ్రెయినేజీ పనులు
- బరితెగించిన భూకబ్జాదారులు
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్

అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని ఆరిపాక పంచాయతీ లగిశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 37/2లోగల 6 ఎకరాలా 32 సెంట్లు మీరా బంద చెరువులో లే అవుట్ వేయడంతో పాటు డ్రెయినేజీ పనులు సాగుతున్నాయి. ఈ చెరువును గత ప్రభుత్వంలో వైసిపి ప్రజాప్రతినిధులు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేశారు. అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఈ చెరువు పంచాయతీరాజ్ చెరువుగా ప్రభుత్వ రికార్డులో గుర్తించబడింది. ఈ విషయమై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని లగిశెట్టిపాలెం, గాలిభీమవరం గ్రామస్తులు చెబుతున్నారు. ఈ చెరువు కబ్జాపై ఇప్పటికే మీడియాలో కథనాలు వచ్చాయి. భూకబ్జాదారులు కోర్టును ఆశ్రయించగా స్టేటస్‌కో వచ్చింది. చెరువు ఏ స్థితిలో ఉంటే ఆ స్థితిలో ఉంచాలని, ఎవరూ ఎటువంటి అక్రమ కట్టడాలూ, నిర్మాణాలు, సాగు చేయడం, వ్యవసాయం చేయడం వంటివి చేయరాదని అందులో కోర్టు నోటిఫై చేసింది. దాన్ని ధిక్కరించి కబ్జాదారులు బరితెగించి అక్రమంగా వేసిన లేఅవుట్‌లో సిసి డ్రెయిన్లు నిర్మాణం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులతో కుమ్మక్కై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రభుత్వ భూమిపై కోర్టులో స్టేటస్‌కో ఉన్నపుడు ఎటువంటి పనులూ చేయరాదని, కోర్టు ధిక్కరణ కింద పనులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎఇ జి.కార్తీక్ స్థానిక తహశీల్దార్ బి.చిన్నికృష్ణకు, హై కోర్టు జిపిలకు తెలియజేసినట్లు తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం మిగతా 2లో..

నేడు రూ.12.64 కోట్లు జమ

రైతుల ఖాతాల్లోకి పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులు



ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పిఎం కిసాన్, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అన్నదాత సుఖీభవ పథకాలకు సంబంధించిన 21వ విడత నిధులు విడుదలయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం అర్హత కలిగిన రైతుల బ్యాంకు ఖాతాలలో ఈ సొమ్ము జమ అవుతుందని పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. విశాఖ జిల్లాలోని భీమిలి, గాజువాక, పెందుర్తి, విశాఖపట్నం పశ్చిమ, విశాఖపట్నం తూర్పు, విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గాలకు చెందిన రైతులకు పిఎం కిసాన్ కింద 16,769 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు చొప్పున రూ.3.3538 కోట్లు, అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కొక్క రైతుకూ రూ.5 వేలు చొప్పున 18,573 మందికి రూ.9.2865 కోట్లు జమకానున్నాయి. మొత్తంగా రెండు పథకాలకు కలిపి రూ.12.6403 కోట్లు రానున్నాయి

సోలార్ ప్యానల్ ఏర్పాటుకు త్వరలో టెండర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలోని ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (సర్కిల్) పరిధిలోగల దళితులకు సౌర విద్యుత్ సబ్సిడీని అందించేందుకు కృషి చేస్తున్నామని సూపరింటెండెంట్ ఇంజినీరు జి.శ్యామ్‌బాబు తెలిపారు. మంగళవారం తన ఛాంబర్‌లో ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో 200 యూనిట్ల కంటే తక్కువ వినియోగించే ఎస్‌సిలకు ఇంటిపై 3 కిలోవాట్ల సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. తమ సర్కిల్ పరిధిలోగల జోన్ 1 నుంచి 4 వరకూ 5400 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. వీరిలో 2700 మంది తమ ఇళ్ల వద్ద ఖాళీ స్థలం 200 చదరపు అడుగుల ఉన్నట్లు తెలియజేశారన్నారు. ఇప్పటికే ఉచిత విద్యుత్ అమలు అవుతున్న కుటుంబాలే పిఎం సోలార్ సూర్యఘర్ పథకానికి అర్హులని తెలిపారు. సోలార్ ప్లాంట్ల ఇన్‌స్టాలేషన్ కోసం టెండర్లను త్వరలో ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ కూడా తోడైతే పథకం అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం

వార్త 5లో..

సోంపురం గిరిజనులకు న్యాయం చేయాలి

వార్త 8లో..

66వ రోజుకు మత్స్యకారుల నిరసన

వార్త 7లో..



విశాఖలో బాలయ్య సందడి

విశాఖ నగరంలో మంగళవారం సినీ నటుడు బాలకృష్ణ సందడి చేశారు. డిసెంబర్ 5న విడుదల కానున్న ఆయన చిత్రం అఖండ - 2 ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. హీరోయిన్ సంయుక్త మీనన్, దర్శకుడు బోయపాటి కూడా హాజరయ్యారు. తనదైన శైలిలో బాలకృష్ణ డైలాగ్‌లు చెబుతూ జగదాంబ థియేటర్‌లోని ప్రేక్షకులను, అభిమానులను అలరించారు.

క్వారీ తవ్వకాలు వద్దే వద్దు

ప్రజాభిప్రాయ సేకరణలో తిరస్కరించిన దేశపాత్రునిపాలెం వాసులు



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు దేశపాత్రునిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహ మినరల్ క్వారీ తవ్వకాలను ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఈ క్వారీపై 9.709 హెక్టార్లు స్టోన్, గ్రావెల్ మైనింగ్ నిమిత్తం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణను స్థానికంగా చేపట్టారు. తమ ప్రాంతంలో క్వారీ వద్దే వద్దని ప్రజలు పెద్దపెట్టున నినదించారు. సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ క్వారీ తవ్వకాల వల్ల ఈ ప్రాంతం తీవ్రమైన కాలుష్యంలోకి నెట్టి వేయబడుతుందని అన్నారు. భూగర్భ జలాలకు నష్టం వాటిల్లుతుందన్నారు. పర్యావరణం నాశనమవుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడొద్దన్నారు. ఇప్పటికే మంచినీటికి, స్వచ్ఛమైన గాలికి, మంచి నేలకి ఈ ప్రాంత ప్రజలు దూరమయ్యారన్నారు. హిందూజా బొగ్గు లారీల కాలుష్యం, ఎన్‌టిపిసి ధూళి కాలుష్యం, ఫార్మా వాయు కాలుష్యంతో అల్లాడిపోతున్నారని తెలిపారు. విలువైన వృక్షాలు, వివిధ జాతుల వనమూలికలు కలిగిన అటవీ ప్రాంతం దెబ్బతింటోందని తెలిపారు. క్వారీకి పది సంవత్సరాల పాటు అనుమతిస్తే ఈ ప్రాంతం వల్లకాడుగా మారుతుందన్నారు. మాజీ ఉప సర్పంచ్ వివి.రమణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, సిపిఎం నాయకులు పిడి నాయుడు, గ్రామస్తులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కాలుష్య కుంపటి పెట్టొద్దని అన్నారు. తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని స్నేహపురి కాలనీ ప్రజలు వేడుకున్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌డిఒకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇకి అందజేశారు.

మొదటి పేజీ తరువాయి..

మీరాబందలో లేఅవుట్

ఈ విషయమై నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తక్షణమే రెవిన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ ఈ విషయమై స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోగులకు ఎఎంఆర్ నిరోధకతపై అవగాహన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కెజిహెచ్,ఆంధ్ర వైద్య కళాశాల అధ్వర్యంలో 'ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత (ఎఎంఆర్) అవగాహన వారోత్సవాలు 2025 ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పూసపాటి రత్నకుమారి, ఎఎంఆర్ నిరోధకత అవగాహన వీడియోను ఆవిష్కరించారు. వీడియోను కెజిహెచ్‌లో టెలివిజన్ ఉన్న విభాగాల్లో ప్రసారం చేయడం ద్వారా రోగుల్లో ఎఎంఆర్ పట్ల అవగాహనను తీసుకువస్తామని డాక్టర్ ఐ.వాణి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వర్తమానాన్ని కాపాడుకోండి - భవిష్యత్తును భద్రపరుచుకోండి అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదంతో కూడిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.శివ కళ్యాణి, ఎఎంఆర్. నివారణ విభాగం నోడల్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న, వైద్య సిబ్బంది ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మనాభరాజు, రాజేశ్వరరావు

ఎవికె ఆధ్వర్యాన ఉద్యోగ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యోగ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు వి.ఎస్.పద్మనాభరాజు తెలిపారు. మంగళవారం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన తరగతులను ఎంతోమంది సద్వినియోగం చేసుకున్నారని ప్రస్తుతం రెండు బ్యాచ్‌లు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ గ్రూప్ 1,2 ఉద్యోగాల కొరకు ఒక బ్యాచ్, రెండోది కేంద్ర ప్రభుత్వ రైల్వే, ఇంటెలిజెన్స్ బ్యూరో , ఏకలవ్య పాఠశాల ఉద్యోగాల కోసం అవకాశం కల్పిస్తున్నామన్నారు. తరగతులకు హాజరు కావాలనే అభ్యర్థులు ఈనెల 24వతేదీ లోగా https://surl.lu/neefca లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకో వాలన్నారు. తరగతులు నవంబర్ 26 నుండి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. తరగతులు విశాఖపట్నంలోనే ఉంటాయని, ఎలాంటి హాస్టల్ సదుపాయం లేదన్నారు . మరిన్ని వివరాలకు 9315014015కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు జి.ఎస్.రాజేశ్వరరావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యు, సతీష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న తెలుగుదండు సత్యాగ్రహం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కరోనా కాలంలో మాతృభాషాద్రోహులు మాత్రం ఏమీకాకుండా మిగిలిపోయారని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి అన్నారు. తెలుగుదండు ఆధ్వర్యంలో, మాతృభాష కోసం సంకల్పించిన 'టిట్టిభ సత్యాగ్రహం" తొమ్మిదో రోజైన మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొన్న కరోనా కాలంలో అనవసరంగా చాలామంది పోయారని, మాతభాషాద్రోహులు మాత్రం మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను వారి మాతృభాష నుండి దూరం చేయడం సాంస్కృతిక ద్రోహమని,ఆంగ్లభాష పేరుతో,పేదల రక్తమాంసాలను దోచుకోవడం ఆర్థికద్రోహం అంటూ విరుచుకుపడ్డారు. కార్యక్రమంలో డాక్టర్ కొచ్చెర్లకోట, అడపా రామకృష్ణ, తిరుపతి రాజమన్నార్,ఆచార్య ఎస్.సూరప్పడు, దేవిశ్రీ పాల్గొన్నారు.

భాగస్వామ్య సదస్సుపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖలో సిఐఐ భాగస్వామ్య సదస్సుతో రాష్ట్రానికి 13 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని, దీనిపై దుష్ప్రచారం తగదని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 613 ఒప్పందాలు . జరిగాయని, వాటిలో 100 సంస్థలు విశాఖ చుట్టూ వస్తున్నాయన్నారు. ప్రపంచం మొత్తం ఇప్పుడు ఎపి వైపు చూస్తోందన్నారు. 2040 కి ట్రిలియన్ డాలర్ ఎకానమీ దిశగా వెళ్తోందన్నారు. అసలు వైసిపి హయాంలో ఎన్ని పరిశ్రమలు తెచ్చారు, వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాల మీద నాటకాలు ఆడుతున్నారన్నారు. సబ్బవరం న్యాయ యూనివర్సిటీ పక్కన ఒక ఐటీ పరిశ్రమ వస్తోందని, తుర్లవాడ వద్ద మరో ఐటి కంపెనీ వస్తోందన్నారు.దువ్వాడ లో విపిఎస్ఈజడ్‌లో ఒక ఐటీ సంస్థకు స్థలం సిద్ధం చేశారన్నారు.

రైల్వేస్టేషన్లలో కాఫీ స్టాల్స్



రైల్వే స్టేషన్‌లో ఏర్పాటైన కాఫీ స్టాల్

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ: భారతదేశపు ఆర్గానిక్ వారసత్వానికి పెద్దపీట వేస్తూ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని అరకు ,కోరాపుట్ రైల్వే స్టేషన్లలో ఆయా ప్రాంతాల ప్రఖ్యాత అరకు కాఫీ కోరాపుట్ కాఫీ బ్రాండ్‌లను ప్రదర్శించేందుకు ప్రత్యేక ఒన్‌స్టేషన్ ఒన్ ప్రాడక్ట్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక అవుట్‌లెట్‌లు తూర్పు కనుమలలోని గిరిజన రైతులు పండించిన కాఫీ సుగంధాన్ని, ప్రామాణిక రుచులను ప్రయాణికులకు కాఫీ ప్రియులకు అందించేందుకు ద్వారాలుగా పనిచేస్తాయి. 111వ 'మన్ కీ బాత్'లో జీ20 సదస్సులో దీని ప్రాధాన్యతను నొక్కి చెబుతూ అరకు కాఫీ యొక్క గొప్ప రుచి సుగంధాన్ని ప్రశంసించారు. 127వ 'మన్ కీ బాత్'లో: కోరాపుట్ కాఫీ యొక్క విశిష్టమైన రుచి, అద్భుతమైన వారసత్వాన్ని 'ఒడిశాకు గర్వకారణం'గా అభివర్ణించారు. ఈ విజన్‌కు అనుగుణంగా, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో వాల్తేర్ డివిజన్ ఈ రెండు ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేసింది.

గిరిజన వ్యాపారవేత్తలకు మద్దతు

డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడంలో కమర్షియల్ విభాగం యొక్క అవిశ్రాంత కృషిని అభినందించారు. గిరిజన రైతుల అంకితభావాన్ని కొనియాడుతూ, "మన దేశీయంగా అభివృద్ధి చేసిన కాఫీ రకాలు ప్రపంచంలోని ప్రతి మూలకు చేరుకోవాలి. దీనికి స్థానిక సమాజాలే ప్రథమ అంబాసిడర్‌లుగా ఉండాలి అని అన్నారు.

అరకు కాఫీ ఆంధ్రప్రదేశ్-ఒడిశా సరిహద్దుల్లో 1,50,000 మందికి పైగా గిరిజన కుటుంబాలు దీనిని స్థిరమైన సాగు పద్ధతుల్లో పండిస్తున్నాయి. కోరాపుట్ కాఫీ ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా భావించే ఒడిశాలోని కోరాపుట్ జిల్లా ఇప్పుడు ప్రపంచ కాఫీ మ్యాప్‌లో చోటు సంపాదించింది. దీని అరబికా గింజలు ప్రత్యేకమైన సుగంధం, తక్కువ ఆమ్లత్వం తో అంతర్జాతీయ బ్రాండ్‌లకు దీటుగా నిలుస్తున్నాయి. దీనికి ఒడిశా రూరల్ డెవలప్‌మెంట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ మద్దతు ఇస్తోంది.

వృద్ధురాలి గొలుసు చోరీ

- మెడికవర్ ఆసుపత్రిలో ఘటన

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ: వెంకోజిపాలెంలోని మెడికవర్ హాస్పిటల్‌లో వృద్ధురాలి గొలుసు చోరీకి గురైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన ఒక వద్ధురాలు ధరించిన సుమారు 28 గ్రాముల బంగారు గొలుసు ఇసిజి పరీక్ష అనంతరం కనిపించకుండా పోయింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఈ నెల 17వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగింది. ఎంవిపి కాలనీ చెందిన సిద్ధబక్తుల చిన్మయేశ్వరి (37) ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిన్మయేశ్వరి తన అత్త అయిన రుక్మిణిని అనారోగ్య కారణాల వల్ల ఈ నెల 16వ రాత్రి మెడికోవర్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. రుక్మిణికి ఇసిజి పరీక్ష పూర్తయిన తర్వాత ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు మాయమైనట్లు గుర్తించారు. ఈ గొలుసు విలువ సుమారు 28 గ్రాములు ఉంటుందని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు క్రైమ్ ఎస్ఐ రవికుమార్ అద్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

మోడీ హయాంలో దళిత, గిరిజనులపై దాడులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు జనగణనలో కులగణన జరపాలని, బిసిలకు 42 శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేస్తూ, మంగళవారం జగదాంబ జంక్షన్‌లో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత దళితులు, ఆదివాసీలు,మైనార్టీలపై, వివక్షత చూపుతూ దాడులు చేస్తున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో వచ్చిన తర్వాత బిజెపి ప్రభుత్వం మరీ బరితెగించి ఉత్తరప్రదేశ్, మణిపూర్, పశ్చిమబెంగాల్ మిగతా రాష్ట్రాల్లో దళితులపై, ఆదివాసీలపై,ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధ, జైన మైనార్టీలపై నేటి వరకు దాడులు జరుగుతూనే ఉన్నాయని,దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను వెలికి తీయడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని,దీన్ని ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తెనాలిలో దళిత మైనార్టీ యువకులను నడిరోడ్డు మీద సిఐ తీవ్రంగా కొట్టడం జరిగిందన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దళితులు ఆదివాసీలు మైనార్టీలు బిసిలపై దాడులు ఆపాలని లేనియెడల ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.చంద్రశేఖర్, ఎం.పైడిరాజు, ఎం.మన్మథరావు, సిఎన్ క్షేత్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేయాలి

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి గోపాలపట్నం మెయిన్ రోడ్డు నరసింహనగర్‌లో కాత్యాయని సమేత త్రికంటి భీమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని జనసేన నాయకులు బెహరా భాస్కరరావు కోరారు. మంగళవారం ఆయన ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయాన్ని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తగినట్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడిమి రామకృష్ణ, బండారు శ్రీనివాసరావు, మార్కండేయ, రాజశేఖర్ పాల్గొన్నారు.

బోర్ వెల్ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు అప్పికొండ వీధిలో నిర్మించిన బోర్ వెల్‌ను వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ మంగళ వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంటా నూకరాజు, ఎస్.జోగారావు, ఎ.నూకరాజు, నరసింగరావు, కొక్కిరి అప్పన్న, వి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ చైర్మన్‌గా కృష్ణమూర్తి రాజు



ప్రజాశక్తి - పద్మనాభం : మండలంలోని బిహెచ్.పురం పిఎసిఎస్ చైర్మన్‌గా సాగి కృష్ణమూర్తి రాజును నియమించినట్లు సోమవారం రాత్రి జిల్లా సహకార బ్యాంకు అధికారుల నుండి ఉత్తర్వులు అందాయి. బాంధేవపురం గ్రామానికి చెందిన కృష్ణమూర్తిరాజు చైర్మన్‌గా, మద్ది గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావు, విజయరాంపురం గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనును డైరెక్టర్లు నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ఈ నెల 15వ తేదీన ప్రారంభమైందని, 28వ తేదీ వరకే అవకాశమున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో కొన్ని సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. కోర్సుల వివరాలు బిఎస్‌సి నర్సింగ్, మ్యాథమెటిక్స్, జువాలజీ, బిఎస్‌సి ఆనర్స్ కెమిస్ట్రీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, బిఏ హానర్స్ హిస్టరీ, బీకాం హానర్స్ కంప్యూటర్ కోర్సులు ఉన్నాయని వివరించారు. వివరాలకు బి.సీతనాయుడు 8978883125, ఎ.విజయలక్ష్మి 8522975829 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కెజిబివిని సందర్శించిన ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తరువాత పాఠశాల ఆఫీస్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ నిర్మిస్తున్న కొత్త లైబ్రరీ భవనాన్ని పరిశీలించారు. ప్లే గ్రౌండ్ నిర్మాణ పనుల పురోగతిని కూడా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ నాగమణి, చిక్కాల విజయబాబు, సోంబాబు, టి.ఆదినారాయణ, బిఆర్‌బి.నాయుడు, పాఠశాల చైర్మన్ శివాజీ, వైస్‌చైర్మన్ అప్పన్న, కోఆప్ట్ సభ్యులు బంగారురాజు, దేముడు బాబు పాల్గొన్నారు.

వారానికి ఒక్కరోజే గ్రంథాలయం

ఏడాదిగా లైబ్రేరియన్ లేక పాఠకుల అవస్థలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలోని గ్రంథాలయం విద్యార్థులకు, రీడర్స్ అందని ద్రాక్షగా మారింది. సుమారు సంవత్సరం నుండి ఈ గ్రంథలయానికి గ్రంథాలయాధికారిని నియమించకపోవడంతో పుస్తకాలు బూజు పడుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు ఇక్కడ కాన రాలేదు. మండల స్థాయి గ్రంథాలయం కావడంతో పోటీ పరీక్షలు విద్యార్థులు రోజూ సుమారు 30 నుండి 50 మంది వరకు వచ్చేవారు. అవసరమైన పుస్తకాలను చదువుకొని వెళ్లేవారు. సంవత్సరం నుండి గ్రంథాలయాధికారి లేక తెరవకపోవడంతో ఎవరూ రావడంలేదు. వారానికొక్కసారి ప్రతి బుధవారమూ ఆనందపురం నుంచి గ్రంథాలయాధికారి వచ్చి తెరుస్తున్నారు. ఆ ఒక్కరోజే తెరవడంతో ఇకరిద్దరు పాఠకులు వచ్చి పేపరు చదివి వెళ్తున్నారు తప్ప విద్యార్థులకు ఉపయోగపడడంలేదు.



ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు ఈ గ్రంథాలయానికి పూర్వం వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుకున్నారు. 1986లో మండల స్థాయి గ్రంథాలయంగా ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎంతోమంది ఈ గ్రంథాలయం సేవలు వినియోగించుకున్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న డిఇఒ, సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోని సెయింట్ ఆంథోని ఓల్డ్ తెలుగు ప్రైమరీ స్కూల్లో డిసెంబరు 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే 3వ మెగా చిల్డ్రన్స్ ఫెస్టివల్ విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ ప్రేమ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు మాట్లాడుతూ, విశాఖ వ్యాలీ రోటరీతో కలిసి సెయింట్ ఆంథోని స్కూల్లో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నగరంలోని 56 మంది ప్రముఖులతో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసామని, బాలోత్సవం బుక్‌లెట్లను పాఠశాలలకు అందిస్తున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా సహకారం అందించాలని డిఇఒను కోరారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, బాలోత్సవం కోశాధికారి సిహెచ్.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు బుజ్జి, లచ్చిరాజు పాల్గొన్నారు.

ఆవు మాంసం అక్రమ ఎగుమతిపై చర్యలు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆవు మాంసాన్ని అక్రమంగా ఎగుమతి చేసిన నిందితులతో పాటు వారి వెనుక ఉన్న శక్తులనూ వదిలిపెట్టేది లేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కొంత్యాం సమీపంలోని దిబ్బడిపాలెం శ్రీ మిత్రా మెరైన్ కోల్డ్ స్టోరేజ్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. కోల్డ్ స్టోరేజ్‌లోని కొంత భాగాన్ని లీజుకు తీసుకున్న తెలంగాణకు చెందిన 'మిష్ ఓవర్సీస్' సంస్థ ఎగుమతి చేస్తున్న మాంసం కంటైనర్‌లో ఆవు మాంసం కూడా కలిసివున్నట్లు తనిఖీల్లో బయటపడిందని గంటా తెలిపారు. మొత్తం 189 టన్నుల మాంసం నుంచి తీసుకున్న ఆరు శాంపిల్స్‌ను పరీక్షల కోసం పంపగా, అందులో 87 టన్నులు ఆవు మాంసంగా నిర్ధారణ అయినట్టు వెల్లడించారు. ఇప్పటికే మిష్ ఓవర్సీస్ సంస్థ యజమానులను అరెస్ట్ చేసినట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంలో ఎసిపి అప్పలరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, శాఖారి శ్రీనివాస్, తాట్రజు అప్పారావు, బిఆర్‌బి.నాయుడు, మహంతి శివాజీ, గండ్రెడ్డి స్వామినాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు, ఎర్ర రాజు, కె.శ్రీకాంత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై చంద్రబాబు వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వైసిపి విశాఖ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి డిమాండ్‌చేశారు. మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని చంద్రబాబు చెప్పిన మాటలు గుర్తుచేశారు. విశాఖ ఉక్కుకు కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ నిధులు ఏ విధంగా వినియోగించారో చంద్రబాబు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. సొంత గనులు లేకుండా విశాఖ ఉక్కు కర్మాగారం నష్టంలో పడుతుందంటూ చేసిన వ్యాఖ్యలు చేతకానితనానికి నిదర్శనంగా భావించాలన్నారు.

ఒక్క ప్రాజెక్టు తెచ్చినట్టు నిరూపించినా రాజీనామా

వైసిపికి గంటా సవాల్

ప్రజాశక్తి-మధురవాడ : వైసిపి హయాంలో మొదలు పెట్టి.. పూర్తి చేసి.. ప్రారంభించిన ఒక్క ప్రాజెక్టు చూపించినా పదవికి రాజీనామా చేస్తానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సవాల్ చేశారు. ఎంవిపి కాలనీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కియా వంటి చెప్పుకోదగ్గ ఒక్క కంపెనీని కూడా రాష్ట్రానికి తీసుకురాలేకపోయిందని చెప్పారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన భాగస్వామ్య సదస్సుతో ప్రపంచమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోందని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఒక్కసారి మాత్రమే పెట్టుబడిదారుల సదస్సును విశాఖలో నిర్వహించారని, సూటు, బూటు వేసి ఫేక్ ప్రతినిధులతో చేసిన ఉత్తుత్తి ఒప్పందాల బండారాన్ని సోషల్ మీడియా బహిర్గతం చేయడంతో రాష్ట్రం పరువు పోయిందని పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు చేస్తున్నామని సిఇఒ సుందర్ పిచ్చయ్ మూడు నెలల ముందు ప్రకటిస్తే.. వైసిపి హయాంలోనే దాన్ని తీసుకు వచ్చామని ఆ పార్టీ నేతలు ప్రకటించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఆంధ్రుల భావోద్వేగమని, దానిపై రాజకీయం చేయడం వైసిపి దిగజారుడుతనానికి నిదర్శనమని గంటా విమర్శించారు. సమావేశంలో కార్పొరేటర్లు పివి.నరసింహం, లొడగల అప్పారావు, భీమిలి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, కూటమి నేతలు చిక్కాల విజయ్‌బాబు, శాఖారి శ్రీనివాస్, గాడు అప్పలనాయుడు, మొల్లి లక్ష్మణరావు, మహంతి శివాజీ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తిపై కత్తితో దాడి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధి కొత్తవలసకు చెందిన కోరాడ అప్పలరాజుపై అదే గ్రామానికి చెందిన బీజపు శ్రీను గ్రామ శివారులో మంగళవారం కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు సిఐ బి.తిరుమలరావు తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడిన అప్పలరాజును అతని కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సలహా మేరకు విశాఖ నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిద్దరి మధ్య కొంత కాలంగా ఉన్న తోడు ఆర్థిక లావాదేవీలే ఈ దాడికి కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. సిఐ బి.తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏట్లాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో ఏట్లాట (నాణేల ఆట) ఆడుతున్న ఏడుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఏట్లాట జరుగుతున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు కె.కోటపాడు సిఐ పైడపునాయుడు ఆధ్వర్యాన పోలీసులు కొల్లి అప్పలనాయుడు కల్లాలలో శిబిరంపై దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.62,200 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న 21 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. గ్రామాల్లో అక్రమ ఏట్లాటలు దందాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరంలో గీతం ఎన్‌సిసి కేడెట్

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్‌సిసి కేడెట్ ఆకాంక్ష ఇటీవల మేఘాలయ ఎన్‌సిసి బెటాలియన్ అఖిలభారత స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభను చాటారు. దేశంలోని 17 ఎన్‌సిసి డైరక్టరేట్ల నుంచి నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాలకు చెందిన 400 మంది ఎన్‌సిసి కేడెట్‌లు ఈ శిబిరంలో పాల్గొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ నుంచి బి.ఫార్మసీ మూడవ సంవత్సరం విద్యార్థిని ఆకాంక్ష ఈ శిబిరంలో పాల్గొని వివిధ రాష్ట్రాల సంస్కృతులను అధ్యయనం చేయడంతో పాటు క్రీడా, చిత్రలేఖనం, బృందగాన పోటీలలో ప్రతిభను చాటారు. గీతం విద్యార్థుల ప్రతిభను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఎన్‌సిసి అధికారులు అభినందించారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ సునీత

యుజిడి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, భగత్‌సింగ్‌నగర్‌లో యుజిడి పనులకు మంగళవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావుతో కలిసి భూమి పూజ చేశారు. జివిఎంసి నిధులు రూ.20 లక్షలతో చేపట్టనున్న ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఎఇ శ్రీనివాస్, నాయకులు మజ్జి రమణి, తురకపూడి బాలస్వామి, పాత్రకండ ధర్మారావు, యల్లమిల్లి సురేష్, పట్టా నూకరాజు, వడిసెల శ్రీను, గుంజా శ్రీనువాసరావు, జక్కన్న, జగన్, సంజీవిరావు పాల్గొన్నారు.

గ్రేడ్-1 అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా అప్పలనాయుడు

ప్రజాశక్తి- లీగల్ : విశాఖపట్నం జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టులకు గ్రేడ్-1 అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా అనకాపల్లి జిల్లా, కసింకోట మండలం, పాత కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కన్నూరు అప్పలనాయుడు నియమితులయ్యారు. అప్పలనాయుడు విశాఖపట్నం జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో ప్రభుత్వం తరపున వివిధ సివిల్, ఇతర న్యాయపరమైన కేసుల్లో వాదనలు వినిపించనున్నారు. అప్పలనాయుడుకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్, కార్యదర్శి ఎల్‌పి.నాయుడు, కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సభ్యులు పి.నర్సింగరావు, కె.రామజోగేశ్వరరావు, బైపా అరుణ్ కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల భద్రతకు కలిసి పనిచేయాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : మహిళ భద్రతకు ప్రజలంతా కలిసి పనిచేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు. ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం సస్టైనింగ్ విమెన్ సేఫ్టీ - బెంచ్‌మార్కింగ్ విశాఖపట్నం సక్సస్ అండ్ ఫ్యూచర్-ప్రూఫింగ్ గవర్నెన్స్ అంశంపై రాష్ట్ర మహిళా కమిషన్, ఎయు దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. జాతీయ స్థాయిలో మహిళా భద్రతపై నిర్వహించిన నారీ 2025 ఇండెక్స్‌లో విశాఖ నగరం ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మహిళల భద్రత కేవలం ఒక వ్యక్తిపైన, వ్యవస్థపైన ఆధారపడి ఉండదని, వారి భద్రతకోసం అందరూ సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విశాఖ ఎంతో సేఫ్ సిటీ అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం అనేక సందర్భాలలో చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ హీరో బాలకృష్ణ

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరహాలక్ష్మీ నరసింహ స్వామిని సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను, ప్రొడ్యూసర్ రామ్ ఆచంట కోటి పరుచూరి మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధా, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి పూసపాటి సునీల్ కుమార్, పిఆర్ఒ నాయుడు ప్రత్యేక మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా వారు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. మూల విరాట్టును దర్శించుకొని, ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనము ఇచ్చారు. స్వామివారి శేష వస్త్రంతో వారిని సత్కరించి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, స్వామివారి దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న బొడ్డేటి విజయ్‌కుమార్

కొత్తపాలెం అండర్ పాత్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి కొత్తపాలెం అండర్ పాత్ మార్గంలో తెలుగుదేశం వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టారు. ఐదు రోజుల క్రితం ఇక్కడ నీరు పారే గ్రిల్స్ వద్ద మరమ్మత్తులు చేపట్టగా కొంతమంది రాత్రివేళ వాటిని తస్కరించుకుపోయారు. ఈ నేపథ్యంలో ఇక్కడ పూర్తిస్థాయిలో నీరు పోవడానికి వీలుగా కాంక్రీట్‌తో పనులు చేపట్టారు. విద్యుత్ దీపాలను పునరుద్ధరించారు. పెయింట్ వేయించారు.

'నీలి మేఘాలు' పరిచయ సభ

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరానికి చెందిన సమతా సాహితి నెలవారీ సాహిత్య కార్యక్రమంలో భాగంగా పౌర గ్రంథాలయంలో మంగళవారం స్త్రీవాద కవితా సంపుటి 'నీలి మేఘాలు' పుస్తకం మీద కవిత్వ పరిచయ సభ నిర్వహించారు. డాక్టర్ మాటూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ కాలమిస్ట్ డాక్టర్ బండి సత్యనారాయణ మాట్లాడుతూ, స్త్రీల పక్షాన మరింత బలమైన కవిత్వం రావాలన్నారు. మహిళా చేతన అధ్యక్షులు కత్తి పద్మ మాట్లాడుతూ, స్త్రీల అస్థిత్వానికి, స్వీయ గౌరవానికి సంబంధించిన అనే అభ్యుదయకరమైన కవిత్వం ఈ కవితా సంపుటిలో ఉందన్నారు. పేరుగాంచిన ఎందరో స్త్రీవాద కవయిత్రుల కవిత్వం ఇందులో ఉందని తెలిపారు. సామాజిక ఉద్యమ కార్యకర్త, న్యాయవాది జహా ఆరా స్త్రీల దోపిడీనీ, శ్రమను ఈ కవితా సంపుటిలో కళ్లకు కట్టినట్టు ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సభలో కొరమాటి చిన్నారావు, డాక్టర్ ప్రతాప్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

నిత్యం తాగునీటి నాణ్యతా పరీక్షలు



గాజువాకలో పంపింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి - యంత్రాంగం

గాజువాక : జివిఎంసి పరిధిలోని అన్ని నీటి సరఫరా పంపింగ్ స్టేషన్ల నిర్వహణను మెరుగుపరచాలని, ప్రజలకు అందిస్తున్న తాగునీటి సరఫరాలో నీటి నాణ్యతా పరీక్షలు పంపింగ్ స్టేషన్లలో నిత్యం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆ విభాగం ఇంజినీర్లకు జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. గాజువాక సుందరయ్య కాలనీలోని 10 ఎమ్‌జిడి కెపాసిటీ పంపింగ్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ప్రధాన ఇంజినీరు పివివి.సత్యనారాయణరాజు, జోనల్ కమిషనర్ బిఆర్‌ఎస్.శేషాద్రితో కలిసి పరిశీలించారు. ఈ పంపింగ్ స్టేషన్‌కు చేరుతున్న నీరు కెపాసిటీ, ఫిల్టర్ అనంతరం విడుదలవుతున్న నీటి కెపాసిటీ, వాటి నాణ్యత, గాజువాక తాగునీటి సరఫరా ప్రక్రియ తదితర వివరాలను పిపిటి ద్వారా నీటి సరఫరా అధికారులు వివరించారు. నిత్యం శాంపిల్స్ జరపాలని, ల్యాబ్‌లకు పంపించాలని, సంబంధిత రికార్డులో ఆయా వివరాలను నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలని ఇంజినీర్లకు కమిషనర్ ఆదేశించారు. పంపింగ్ స్టేషన్లలో చేపడుతున్న అన్ని ప్రక్రియలను తెలుసుకునేందుకు వార్డు ఎమినిటీస్ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చి వారికి నీటి సరఫరా నిర్వహణ ప్రక్రియలో పూర్తి అవగాహనను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కాడ స్టేషన్ నిర్వాహక ఏజెన్సీ ప్రతినిధి రమేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్, సహాయక వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్, ఎఇ, వార్డ్ ఎమినిటీస్ కార్యదర్శి పాల్గొన్నారు.

టిడిఆర్ ప్రక్రియ వేగవంతం

సీతమ్మధార : అక్కయ్యపాలెం ప్రధాన రహదారి రోడ్డు విస్తరణలో ఆస్తులకు సంబంధించి టిడిఆర్ జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి 80 అడుగుల రహదారిలో ఉన్న బాబా తాజుద్దీన్ అవులియా ఆశ్రమానికి (మసీదు) టిడిఆర్ జారీకి సంబంధించి మంగళవారం కమిషనర్ స్థల పరిశీలన చేశారు. మసీదుకు సంబంధించిన ఆస్తి ఎంతవరకు కోల్పోయారు, అందుకు సంబంధించిన పత్రాలు, వారు జివిఎంసికి చెల్లించిన ఆస్తి పన్ను వివరాలు పరిశీలించారు. మసీదు ప్రతినిధులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. టిడిఆర్ ప్రక్రియ వేగవంతం చేసి త్వరలోనే అందిస్తామని మసీదు ప్రతినిధులకు కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో జోనల్ కమిషనర్ బి.రాము, డిసిపి రామ్మోహనరావు, ఎసిపి తిరుపతిరావు, టిపిఒ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన

స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునర్నిర్మాణ పనులను ప్రధాన ఇంజినీరు పివివి.సత్యనారాయణరాజుతో కలిసి పరిశీలించారు. స్టేడియం పునర్నిర్మాణ పనులు మందకొడిగా సాగడంపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వర్ణ భారతి స్టేడియంలో ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించి పరిశుభ్రపరచాలని, గదులలో పెయింటింగ్, రోడ్డు పనులు ల్యాండ్ స్కేపింగ్ పనులను త్వరగా పూర్తిచేసేలా గుత్తేదారులకు సూచించాలని ప్రధాన ఇంజినీరును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, ఇఇ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కణితి రోడ్డు పార్కింగ్‌కు మోక్షం

ప్రజాశక్తి -గాజువాక : దశాబ్దాలుగా వాహనదారులను పట్టిపీడిస్తున్న గాజువాక కణితి రోడ్డు పార్కింగ్‌కు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో మోక్షం కలిగింది. జివిఎంసి 66వ వార్డు పరిధి బిసి రోడ్డు నుండి కణితి రోడ్డు మార్కెట్ మొదలకుని మసీద్ వరకు వెళ్లాలంటే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కణితి రోడ్డులోని షాపులకు వచ్చే కొనుగోలుదారులు రోడ్డుపై వాహనాలు నిలపడం, ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలుపుదల చేయడం, కొంతమంది రోడ్డుపైనే చిరు వ్యాపారం చేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. పండగల సమయంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉండేది. అటువంటి సమయంలో తూతూ మంత్రంగా నాలుగైదు వాహనాలు, షాపులకు కేసులు రాసి చేతులు దులుపుకునేవారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా కణితి రోడ్డు పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభించేదికాదు.

గాజువాక ట్రాఫిక్ సిఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ హుస్సేన్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఎస్ఐ కె.శాంతారామ్ సిబ్బందితో కలిసి వాహనదారులకు, ప్రజలకు, వ్యాపారవేత్తలకు, చిరు వ్యాపారులకు అవగాహన కల్పించి బిసి రోడ్డు నుండి కణితి రోడ్డు మసీద్ వరకు రోడ్డు సెంట్రింగ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేసి వాహనదారుల కష్టాలకు తెరదించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజశేఖర్, వెంకటేష్, శ్రీకాంత్, నాయుడు, నాగరాజు పాల్గొన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించిన పోలీసులకు చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిఐ షేక్ హుస్సేన్‌ను వ్యాపారులు ముత్త అప్పారావు, ఆవాల శివ, శ్రీను, ప్రకాష్ తదితరులు సత్కరించారు.



రోడ్డు సెంటరింగ్‌లో ఏర్పాటుచేసిన పార్కింగ్

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : పలు సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు నగర జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ రూ.40 వేలు ఆర్థిక సహాయం అందించారు. 36వ వార్డుకు చెందిన హరీష్‌కు ఆటో మరమ్మతు నిమిత్తం, బషీర్‌కు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం, 30వ వార్డుకు చెందిన రాజయ్య హాస్పిటల్ ఖర్చులు, 39వ వార్డుకు చెందిన జరినాబేగం కుమార్తె వివాహ నిమిత్తం, 37వ వార్డుకు చెందిన రితిక, సాహిల్ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.కూటమి నాయకులు, పాల్గొన్నారు

స్టీల్ సిఎంఎం ఉద్యోగుల బాసట

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్ సిఎంఎం విభాగంలో కాంట్రాక్టు (స్వీపర్) కార్మికునిగా విధులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురై కాలు తొలగింపునకు గురైన కె.నారాయణకు సిఎంఎం అధికారులు, ఉద్యోగులు బాసటగా నిలిచారు. రూ.1,00,251 విరాళాలుగా సేకరించి నారాయణ కుటుంబానికి అందజేశారు.

జివిఎంసి కార్మికులకు యూనిఫాం పంపిణీ



కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రసాద్

ప్రజాశక్తి-యంత్రాంగం

జివిఎంసి పారిశుధ్య కార్మికులకు మంగళవారం పలుచోట్ల యూనీఫామ్‌ను పంపిణీచేశారు. మహిళా కార్మికులకు మూడు చీరలు, జాకెట్లు, పురుష కార్మికులకు మూడు జతల యూనీఫాం, టవల్స్ అందించారు.

కొమ్మాది: జివిఎంసి 5వ వార్డు పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మధురవాడ స్వతంత్రనగర్‌లోని వార్డు కార్యాలయంలో యూనీఫామ్‌ను కార్పొరేటర్ మొల్లి హేమలత పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాస్, నాయకులు నాగోతి సత్యనారాయణ, ఈగల రవికుమార్, ఎండ అప్పారావు, జోగేశ్వరపాత్రో తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధిలో పారిశుధ్య కార్మికులకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బొడ్డేపల్లి సుధాకర్ ఆధ్వర్యాన యూనిఫామ్‌ను కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ద్వారా పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సనపల శ్రావణ్‌కుమార్, వార్డు శానిటరీ సూపర్‌వైజర్లు సింహాచలం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ యూనీఫామ్‌ను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సేనాపతి అప్పారావు, బలిరెడ్డి గోవిందరాజు, కె.చిన్నా, ఎన్.కృష్ణ, దూది నరసింగరావు, ఎన్.ఈశ్వరరావు, కోటా రామారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యం సూపర్‌వైజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.



యూనిఫాం అందజేస్తున్న కటుమూరి సతీష్ తదితరులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం



కార్యక్రమంలో పాల్గొన్న ఎయు విసి, కలెక్టర్, సిపి తదితరులు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : సమాజాన్ని అస్తవ్యస్తంగా మార్చే, కుటుంబాలను ఆర్థికంగా ఛిన్నాభిన్నం చేసే మాదక ద్రవ్యాల జోలికి పోవొద్దని, బంగారు భవిష్యత్తు వైపు అడుగులేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, సిపి శంఖబ్రత బాగ్చీ, ఎయు విసి జిపి.రాజశేఖర్ యువతకు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్య రహిత సమాజ స్థాపన లక్ష్యంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన నషా ముక్త అభియాన్ కార్యక్రమానికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ మంగళవారం అమృత్ సర్ నుంచి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి దేశంలోని వివిధ రాష్ట్రాల యువతనుద్దేశించి మాట్లాడారు. స్థానికంగా విశాఖలోని ఎయు వైఎస్.మూర్తి ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దే మహా యజ్ఞంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డీ-అడిక్షన్ సెంటర్ల ఆవశ్యకతను తెలిపారు. సిపి మాట్లాడుతూ యువత ఎంజాయ్ పేరుతో మాదక ద్రవ్యాలకు అలవాటు పడి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఎయు విసి రాజశేఖర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో తలెత్తే దుష్పరిణామాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సిబి జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : నషాముక్త భారత అభియాన్‌పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కొండపేట పరిసరాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి మాట్లాడుతూ, యువత మత్తుపదార్థాలకు బానిసై అమూల్యమైన భవితను కోల్పోతున్నారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.స్వర్ణలత బి.సీతనాయుడు, ఎ.విజయలక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న సత్యం, మహాత్మా నర్సింగ్ కాలేజీల విద్యార్థులు

వేపగుంట : సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సత్యం నర్సింగ్, మహాత్మా నర్సింగ్ కాలేజీల ఆధ్వర్యంలో పినగాడి జంక్షన్ నుంచి పెందుర్తి వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ కన్వీనర్, న్యూలైఫ్ సంస్థ ప్రతినిధి శ్రీకాళీ మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు.

మధురవాడ : చంద్రంపాలెం పాఠశాలలో నషాముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞను విద్యార్థులచే చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోవిందరావు, ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్ ఫ్రీ అనకాపల్లి వైపు అడుగు

అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ వద్ద మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా "అభ్యుదయ సైకిల్ ర్యాలీ"ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. డైట్ కాలేజ్, ఆదిత్య కాలేజ్ విద్యార్థులు ఆకట్టుకునే స్కిట్ ప్రదర్శించి ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా తదితరులు మాట్లాడుతూ డ్రగ్ ఫ్రీ అనకాపల్లి వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం సైకిల్ ర్యాలీ పెరుగు బజార్, నాలుగు రోడ్లు, ఆర్టీసీ కాంప్లెక్స్, నేషనల్ హైవే మీదుగా మునగపాక మండలంలో ప్రవేశించింది. కార్యక్రమంలో ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, ఈ.శ్రీనివాసులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల తదితరులు

మునగపాక : డ్రగ్స్ నిర్మూలన కోరుతూ పోలీస్ శాఖ చేపట్టిన సైకిల్ ర్యాలీ మంగళవారం మండల కేంద్రం మునగపాక చేరుకుంది. దీనికి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, దాడి ముసలి నాయుడు, మొల్లేటి ఆనంద్, సూరిబాబు, కారుకొండ కాశీ, సూరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : గంజాయి మాదకద్రవ్యాలు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సైకిల్ ర్యాలీ మంగళవారం అచ్యుతాపురం చేరుకుంది. ఈ ర్యాలీకి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్‌వివి చంద్రశేఖర రావు, విద్యార్థులు, అధికారులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిటి శ్యామ్, ఎస్సై వెంకట్రావు, అచ్యుత విద్యా సంస్థల వ్యవస్థాపకులు పల్లి శేషగిరిరావు, ఎంపీడీవో, డిప్యూటీ ఎంఈఓ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని కన్నంపాలెం గ్రామానికి బైన రాముకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.92,000 చెక్కును టిడిపి కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చేతుల మీదగా అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, మాజీ ఎంపిపి గునూరు పెదబాబు, నాయకులు మత్స్యరాజు, సిరిపురం రమేష్, గునూరు మాలినాయుడు, ఎర్రంశెట్టి చిన్న, గునూరు పెద్ద అచ్చిబాబు, మజ్జి గౌరీశంకర్ పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 83వ డివిజన్ మిర్యాల కాలనీలో మంగళవారం రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. స్థానిక మిరియాల కాలనీవాసులు గతంలో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణకు చేసిన విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ నిధులతో సిమెంట్ రోడ్డు మంజూరైంది. కార్యక్రమంలో 83, 82 టిడిపి డివిజన్ ఇంచార్జిలు బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్, యాంద్ర రామకృష్ణ, కొణతాల గణేష్, వెల్లంకి వాసు, ఎస్.భానుచందర్(అఖి), ఆకుల నానాజీ, కొణతాల వాసు, షేక్ రియాజ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'జనవాణి'

ప్రజాశక్తి - యలమంచిలి : సమస్యల సత్వర పరిష్కారానికి స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం 'జనవాణి' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అందుబాటులో ఉండి స్వయంగా అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తారని తెలిపారు. సమస్యలు రాతపూర్వకంగా ఇవ్వాలని, ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు కూడా అర్జీలో పేర్కొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : 33/11 కెవి పురుషోత్తపురం సబ్ స్టేషన్ /ఫీడర్ పరిధిలోని పోతంరెడ్డిపాలెం లైన్ మెయింటినెన్స్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారం యూపీ స్కూల్లో ఉపాధ్యాయుడు పి.ఉమామహేశ్వరరావును జిల్లా విద్యాశాఖ అధికారి సస్పెండ్ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి గీతా తెలిపారు. రెండు రోజుల క్రితం సదరు ఉపాధ్యాయుని భార్య అనుమానస్పద స్థితిలో మృతి చెందడంతో క్రిమినల్ కేసు నమోదు కావడంతో ఆయన్ను సస్పెండ్ చేశారని పేర్కొన్నారు.

ఘనంగా గోపికృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : మాజీ వైస్ ఎంపిపి, టిడిపి నాయకులు వేగి గోపికృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు, డాక్టర్ పీలా శ్రీకాంత్, నాయకులు కాండ్రేగుల సతీష్, పెదపాటి కళ్యాణి పాల్గొన్నారు. ఉదయం గోపికృష్ణ నివాసంలో పార్టీ నాయకులు షేక్ బాబర్, ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణరావు, తిర్రి చిరంజీవి తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



గోపికృష్ణను సత్కరిస్తున్న టిడిపి నేతలు

పిఎంఎవై 2.0 పథకాన్ని వినియోగించుకోవాలి



హౌసింగ్ ఇంజనీర్ వరప్రసాద్

ప్రజాశక్తి-కోటవురట్ల : కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పిఎంఎవై 2.0 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇంటి స్థలం ఉండి అర్హత కలిగిన లబ్ధిదారులకు ఎంపిక చేయడానికి ఈనెల 30 వరకు అవకాశం ఉందని చెప్పారు. ఇందు నిమిత్తం ప్రత్యేకంగా సచివాలయంలో అధికారులను నియమించడం జరిగిందని, లబ్ధిదారులకు అర్హతల ఆధారంగా గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. ఆన్లైన్ ద్వారా వివరాలు పొందుపరచుకోవాలని కోరారు.

యర్రవరం రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గత బుధవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు యర్రవరం రోడ్డును మంగళవారం పరిశీలించారు. జనవాణిలో కొక్కిరపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు ఎం గోపినాథ్ యర్రవరం రోడ్డు బాగోలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపాలిటీ ఏఈ నానాజీ యర్రవరం రోడ్డును పరిశీలించారు. వెంటనే గ్రావెల్ వేసి రోలింగ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గోపినాథ్, తాతాజీ, రాజమహేష్, మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ క్యాంపు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో సచివాలయం సిబ్బంది గీత ప్రైమరీ హైస్కూల్లో స్పెషల్ ఆధార్ క్యాంపు మంగళవారం ప్రారంభించారు. ఈ పరిధిలో ఉన్న వారు దీని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గీత ప్రైమరీ హైస్కూల్ కరస్పాండెంట్ అన్నారావు, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి కూండ్రపు ప్రదీప్ పాల్గొన్నారు.

టిడిపి పటిష్టతకు కృషి చేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న టిడిపి కమిటీల నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి, అనకాపల్లి రూరల్ : తెలుగుదేశం పార్టీలో పదవులు పొందిన వారు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. స్థానిక సత్యాలక్ష్మి గ్రాండ్ కళ్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో అనకాపల్లి మండల టిడిపి ప్రధాన, అనుబంధ కమిటీల, గ్రామ క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఇందులో పాల్గొన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కొట్ని బాలాజీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ పీలా శ్రీకాంత్, ఏఎంసీ చైర్మన్ పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులుగా కర్రి వెంకట సన్యాసి నాయుడు (బాబి), ప్రధాన కార్యదర్శిగా నంబారు శ్రీను, అన్ని అనుబంధ కమిటీలు, గ్రామ, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలు ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కోత దశలో ఉన్న వరి పంటను రక్షించుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని తిమిరాంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే పంట నష్టం అనివార్యమవుతుందని హెచ్చరించారు. మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు, చీడికాడ మండలాల యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 23వ తేదిన చీడికాడలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. 26 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని, దీనిని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, డి.డి.నాయుడు, బండారు రామారావు, కోమార బాబురావు, కడిమి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిన్ స్విమ్మింగ్‌లో సంస్కృతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పరవాడ : విశాఖ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు పలు విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబర్చారు. కె.ఆద్య, సాకేత్ ప్రధాన్, జె.జయదీప్, డి.నిఖిల్, డి. బేర్విక, ఎం. కార్తీక్, ఎల్. హిమప్రభాస్, యువరాజ్ బంగారు పతకాలు, ఐ.వైష్ణవి, ఆర్.శరత్, పి.తేజస్వరూప్ రజత పతకాలు, కార్తికేయ యస్వంత్, ఇక్రమ్, సాహిల్ గోవింద్ కాంస్య పతకాలు సాధించారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి అభినందించారు. కోచ్ హరినాథ్ రెడ్డి సేవలను కొనియాడారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందజేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేయడంలో అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని నర్సీపట్నం డిడిఓ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని లింగాపురం, సుంకపూరు గ్రామాలలో మంగళవారం జరిగిన గ్రామసభలలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతుల నిర్వహణ పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పరిశుభ్రమైన తాగునీరు వీధిలైట్లు నిర్వహణ పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పంటల పరిశీలన


ప్రజాశక్తి-రాంబిల్లి : రాంబిల్లి మండలం కుమ్మరాపల్లి, కట్టుబోలు, రాజాల, అచ్యుతాపురం మండలం హరిపాలెం, కొండకర్ల, యల్లమంచిలి మండలం కట్టుపాలెం, తెరువుపల్లి గ్రామాలలో పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ బి భవాని మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాలలో మెడ విరుపు, పొడతెగులు గమనించడం జరిగిందని తెలిపారు. మెడ విరుపు తేగులకు ట్రైసైక్లోజోల్ ఎకరాకు 120 గ్రాములు 200 లీటర్ల కలిపి పొలం అంతా తడిచేటట్లు పిచికారి చేయాలని సూచించారు. పాము పొడ తెగులకు ప్రాపి కొనజోల్ 200 మిల్లీమీటర్లు ఎకరాకు పిచికారి చేయాలన్నారు. తెల్లరాల్పుపురుగు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యగా వేప నూనె 1500 పిపియంను లీటర్లకు 5 మిల్లీమీటర్లు కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిసిటి కెవికే శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు, మండల వ్యవసాయ అధికారి సుమంత, వ్యవసాయ విస్తరణ అధికారి దేవుడు, రామారావు, ఎంపిఇఒ మేఘన, వి.ఎఎ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో వేమగిరి గ్రామంలో రాష్ట్ర గోకుల్ మిషన్ ఆర్థిక సహాయంతో ఉమ్మడి విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో మంగళవారం ఉచిత పశు గర్భ కోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. పశు వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమం నక్కపల్లి ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మాణిక్యం వీర్రాజు మాట్లాడుతూ పశువుల పునరుత్పత్తిలో యాజమాన్య చర్యలు, పోషణ మెలకువలు వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సజ్జ శ్రీనివాసరావు, విశాఖపట్నం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర రావు, డైరెక్టర్ నల్లల రామకృష్ణ, గ్రామ సర్పంచ్ ముప్పిన అబ్బాయిదొర, పశు వైద్యాధికారులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ సాయిశంకర్, డాక్టర్ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ మంగళవారం తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తోమాల సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



తిరుమలలో టిడిపి నేత సాయికృష్ణ

చెరువు భూమి కబ్జాపై ఆందోళన



మీడియాతో మాట్లాడుతున్న మూడు గ్రామాల పెద్దలు

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని యర్రవరం రెవెన్యూ పెద్దపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామాల పరిధిలో సర్వే నెంబర్ 286/2బిలో చెరువు భూమి ఆక్రమణపై స్థానికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సర్వే నెంబర్ 3ఎకరాలు 20సెంట్లు చెరువు ఉంది. గతంలో ఈ చెరువు నీటితో గ్రామాలు అవసరాలు తీర్చుకునేవారు. ప్రస్తుతం ఆ చెరువు భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసి దొంగ పట్టాలు సృష్టించుకొని స్థలం ఆక్రమణకు వచ్చారు. దీంతో మూడు గ్రామాల ప్రజలు వారిని అడ్డుకున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు వద్దకు వెళితే వారు సరిగా స్పందించకుండా మాట దాటవేస్తు, కబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. దీంతో కౌన్సిలర్ దాసరి కుమార్ ఆధ్వర్యంలో అన్ని పార్టీ నాయకులు కలిసి ఆందోళనకు దిగారు. పెద్దపల్లిలోని అమ్మవారి గుడిలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బొద్దపు శ్రీనివాసరావు, కోడిగుడ్డు రమణ, కౌన్సెలర్ దుంగా అచ్చుతరావు, బొద్దపు నాగేశ్వరరావు, బొద్దపు శ్రీనివాసరావు (రమణ), దంట్ల వెంకట స్వామి, శివ గ్రామ యువత పాల్గొన్నారు.


డిఇఒకి యుటిఎఫ్ అభినందనలు



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారిగా గిడ్డి అప్పారావు నాయుడు బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా, ఆయనను యూటిఎఫ్ అనకాపల్లి జిల్లా నాయకులు మంగళవారం కలిసి పూల మొక్క బహుకరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా శాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేస్తున్నారని అప్పారావు నాయుడుని వారు ప్రశంసించారు. అనంతరం పలు ఉపాధ్యాయ, విద్యా సంబంధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ 2024 - 25 స్పాట్ వాల్యూయేషన్ చేసిన ఉపాధ్యాయులకు నేటికీ డిఎ చెల్లించలేదని దానిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏకోపాధ్యాయులు, సెలవులు, ఓ.హెచ్‌లను ఉపయోగించుకొనుటకు గాను తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఆయా మండలాల్లో మిగులు టీచర్లుగా ఉన్న ఎస్జీటీలను గుర్తించి, సింగిల్ టీచర్స్ సెలవు పెడితే, వారి స్థానంలో సర్ప్లస్ (మిగులు) టీచర్స్‌ను, డిప్యూటేషన్ వేసుకొనేలా ఎంఈఓ లకు తగు సూచనలు ఇవ్వాలని కోరారు. ఇటీవల తుఫాన్ కారణంగా ప్రకటించిన సెలవులను రెండవ శనివారం పనిచేయాలని ఆదేశించి ఉన్నారని, టోటల్ వర్కింగ్ డేస్ సరిపోతున్న కారణంగా రెండవ శనివారం పనిచేయాలని ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలన్నారు. దీనిపై డిఇఒ అప్పారావు నాయుడు స్పందిస్తూ సమస్యలు అన్నింటినీ త్వరలో పరిష్కరించగలమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, నాయకులు ఆశ, నూతన్, గొంది ఈశ్వర్, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-పరవాడ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండలంలోని ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడ చీపురుపల్లి, తిక్కవానిపాలెం గ్రామాల్లో 'మన ఊరికి-మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ప్రజలను నేరుగా కలిసి ప్రజా సమస్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం తమ ప్రభుత్వం ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, తహశీల్దారు నాగరాజు, మండల ప్రత్యేకాధికారి, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాధరావు, మాజీ ఎంపిపి మాసరపు అప్పలనాయుడు, ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల ప్రసాద్, సర్పంచ్‌లు చింతకాయల సుజాత, చేపల మసేను, శివలంక లక్ష్మీ నాయుడుపాలెం ఎంపిటిసి కూండ్రపు శ్రీరామమూర్తి, కూటమి నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, గొర్లి రామునాయుడు, బుగిడి రామ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేపలవేట పరికరాలు అందజేత

పరవాడ : మండలంలోని ముత్యాలమ్మ పాలెం గ్రామపంచాయతీ పరిధి ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలారిపేట గ్రామాల మత్స్యకారులకు చేపలవేట పరికరాలను మంగళవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అందజేశారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద 43 మంది మత్స్యకారులకు ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.5 లక్షల విలువైన ఫైబర్ తెప్ప, ఇంజన్, వల కలిపి, మొత్తంగా 43 మందికి రూ.2.15 కోట్ల విలువైనవి అందించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాధరావు, టిడిపి మండల అధ్యక్షులు కన్నూరు వెంకటరమణ, ఎంపిటిసిలు అర్జిల్లి దేవరవి, మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, నాయకులు సూరాడ ముత్యాలరావు, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి తాతారావు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న ఎమ్మెల్సీ చిరంజీవి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : శ్రీనూకాంబిక అమ్మవారిని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, ఆలయ ధర్మకర్తలు మారిశెట్టి శంకర్రావు, సూరే సతీష్, భానుచంద్ర పాల్గొన్నారు.



జెసిబి ముందు బైఠాయించిన స్థానికులు

కందకం తవ్వకాల పనుల అడ్డగింత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఆర్.భీమవరం గ్రామంలో ప్రభుత్వ భూములు సరిహద్దుల్లో మంగళవారం జెసిబితో కందకం తవ్వకాల పనులు చేపట్టగా గ్రామస్తులు అడ్డుకున్నారు. జెసిబికి అడ్డంగా బైఠాయించి నిరసన తెలిపారు. గతంలో కడియాల రాజేశ్వరరావు అనే వ్యక్తి 30 ఎకరాల భూములను కొనుగోలు చేశారు. అవి డి పట్టా భూములని తేలడంతో ప్రభుత్వానికి అప్పగించేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన దస్తావేజులను అందజేశారు. పిఓటి నిబంధనలు ఉల్లంఘించినట్టు నిర్ధారణ కావడంతో గతంలో ఇచ్చిన డి పట్టాలని రద్దు చేస్తూ రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములుగా పరిగణిస్తూ సరిహద్దులు గుర్తించడానికి చర్యలు తీసుకున్నారు. ఆ భూముల్లో ఎవరు ఆక్రమించకుండా చుట్టూ కందకాలు తవ్విస్తుండగా గ్రామానికి చెందిన చీపురుపల్లి మల్లమ్మ, ఎర్రన్న, నారాయణమ్మ, రొంగల ఎర్రయ్య, చంద్రయ్య, సన్యాసిరావు వెళ్లి పనులు అడ్డుకున్నారు.

హైస్కూల్ పక్కన చెత్త తొలగింపు

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో స్టేషన్‌రోడ్డు స్కూలు పక్కన పేరుకుపోయిన చెత్తను మంగళవారం తొలగించారు. రైల్వే భూములకు, హైస్కూలుకు మధ్యన గల దారిలోని రోడ్డు చీకటిగా ఉంటుంది. అక్కడ నిత్యం మద్యం సేవించేవారు, ఇతర అసాంఘిక శక్తులు గుమికూడి వాడి పడేసిన వస్తువులతో చెత్త పేరుకుపోయింది. దాన్ని మున్సిపల్ శానిటరీ సిబ్బంది చెత్త వాహనాల్లో అక్కడి చెత్తను తొలగించడం పట్ల టిడిపి, జనసేన నేతలు మళ్లిపాటి మల్లి ఖార్జునరావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై దర్యాప్తు

ప్రజాశక్తి-కోటవురట్ల : పిజిఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు తిరుమల బాబు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం 9 ఫిర్యాదులను పరిశీలించారు, సుంకపూర్, రామచంద్రపురం శివారు సన్యాసి రాజుపాలెం, కొడవటిపూడి గ్రామాలలో అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ, విఆర్ఓ పెద్దన్నదొర, విలేజ్ సర్వేయర్ పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ భక్తకవి కనకదాస జయంతి వేడుకలు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక సమానత్వం, భక్తి మార్గం, నైతికత, మానవతా విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన కనకదాస వంటి మహనీయులు మన సమాజానికి శాశ్వత ప్రేరణ అని పాల్గొన్న అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిసిఆర్ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్సైలు ప్రసాద్, సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ, హెల్త్ క్లినిక్ భవనాల మంజూరు

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడు మండలానికి గ్రామ సచివాలయం, తాగునీటి బోర్లు, హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రయ్యపేటకు రూ.32 లక్షలతో సచివాలయ భవనం, పోతనవలస, గుల్లేపల్లి గ్రామాలకు లక్ష రూపాయలు చొప్పున రెండు తాగునీటి బోర్లు, పిండ్రంగి, ఏ కోడూరు, దాలివలస, గవరపాలెం గ్రామాలలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలకు నిధులు మంజూరైనట్లు చెప్పారు.

గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని పొందవచ్చునని స్థానిక ఎంపిడివో పి.పద్మజ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఎల్ఎస్‌డిజి థీమ్ 5 శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామాలలో చెత్త, చెదారం లేకుండా ప్రతిరోజు పారిశుధ్య కార్మికులు చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని కోరారు. వైసిపి నాయకుడు బోకం రామునాయుడు, ఎంఈఓ ఎంజె రవీంద్రబాబు, సీనియర్ అసిస్టెంట్ పివి పంతులు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

66వ రోజుకు మత్స్యకారుల నిరసన


దీక్షా శిబిరంలో నిరసన నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేసారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు మంగళవారం 66వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవితాలు బుగ్గిపాలు అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే హెటిరో కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలో కలవడం వల్ల మత్స్య సంపద ఉత్పత్తి తగ్గడంతో రోడ్డును పడ్డామని ఆవేదన వెలబుచ్చారు. ఈ ప్రాంతంలో వేట సాగకపోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కంపెనీ కాలుష్యం కారణంగా అనేక రకాల ప్రాణాంతకరమైన వ్యాధులు బారినపడి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా మన్నారు. ఇటువంటి నేపథ్యంలో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ జీవన విధానం, ఉనికికి ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పిక్కి సత్తియ్య, మత్స్యకార నాయకులు బి బాబ్జి, సోమేశ్వరరావు, మాధవ, జాన్ , చిట్టమ్మ, నూకమ్మ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పన లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మాడుగుల : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకే పల్లె గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసినట్లు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.శ్రీనువాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభించిన డిజిటల్ గ్రంథాలయంలో విద్యార్థులకు నిరుద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత స్వయంఉపాధికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు నెలరోజుల పాటు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేస్తామని,. వాటిని ఉపయోగించుకొని బ్యాంకుల నుండి రుణాలు పొంది స్వయంఉపాధికి వినియోగించు కోవచ్చన్నారు. సూక్ష్మ, చిన్న మధ్యతర పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చే శిక్షణ తరగతులు గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తిదారులు సంఘం సిఇఒ వడ్డి రాజ్‌కుమార్ ఆర్‌కె.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జాజిమొగ్గల ప్రసాద్, తవ్వా సన్యాసిశెట్టి, పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడంపై ఎంపిడిఒ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ డి.వరలక్ష్మి ద్రవ ఘన, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, చెత్త నుండి సంపద తయారీ,స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించారు.డిప్యూటి ఎంపిడిఒ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆరుతడి విధానంలో సాగు మేలు



విత్తన ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి -మాడుగుల: రబీ సీజన్‌లో ఆరుతడి విధానంలో పంటల సాగు ప్రయోజనకరమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ లచ్చన్న అన్నారు. మంగళవారం మండలంలోని వీరనారాయణం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆరుతడి విధానంలో ఆముదం, గోరుచిక్కుడు, అనుములు, సజ్జలు, బొబ్బర్లు, జొన్న, తోటకూర గోంగూర, మొదలైన పంటలను అంతర పంటలుగా వేసుకోవాలని అన్నారు. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఆరు తడి పంటల విత్తనాలు నాలుగు కేజీల కిట్‌ను రూ.300లకే రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక పంటలు కంది ఆముదం, అనుములు, సజ్జలు సాగు చేసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు పోటీలు


నర్సీపట్నంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శాఖ వీధి శాఖా గ్రంథాలయంలోగ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు నిర్వహణలో సాయి శక్తి టెక్నో స్కూల్ విద్యార్థులకు శ్రీశ్రీ కళావేదిక సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో చిత్రలేఖనం, డిబేట్, పద్యాల పోటీలు నిర్వహించారు. ప్రోగ్రామ్ ఛైర్మన్ బల్లా నాగభూషణం, సాయిశక్తి టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ ఏ.రాజశేఖర్, శ్రీశ్రీ కళావేదిక సంస్థ జిల్లా అధ్యక్షులు జిఎల్ఎన్.శాస్త్రి పాల్గొన్నారు.

తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.పద్మావతి ఆధ్వర్యాన 'మరోసారి గ్రంథాలయ ఉద్యమం" అంశంపై ఉపన్యాసం అందించారు. గ్రంథాలయాల చరిత్ర, ఉద్యమాల ప్రాధాన్యత, నేటి పరిస్థితుల్లో వాటి అవసరాన్ని జనసాహితీ ప్రతినిధి ఓవిఎస్ రామకృష్ణ విశదీకరించారు. కార్యక్రమంలో దళితఅవగాహన గోవిందరావు, పెతకంశెట్టి బలరాం, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చోడవరం : విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఎంఎస్ఎల్.జోగేశ్వరి, గూనూరు ప్రభాకర్, కందరప మూర్తి పాల్గొన్నారు.

కశింకోట : తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వం పోటీలు జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులు వై.ఉదయదేవి, జి.హరికృష్ణ, కె.మహాలక్ష్మీనాయుడు గ్రంథాలయాధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

కోటవురట్ల : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విశ్రాంత లైబ్రేరియన్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. .లైబ్రేరియన్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : చౌడువాడ శాఖ గ్రంథాలయంలో హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్‌ఎం.పద్మావతి. తెలుగు ఉపాధ్యాయులు వరలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు.

యలమంచిలి : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగాపట్టణంలోని జూనియర్ కాలేజీలు, హైస్కూళ్లలో మంగళవారం 'క్విజ్, వ్యాసరచన' పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.ఆనంద్, హెచ్ఎం వై.వి.రమణ, కెకె.రామలక్ష్మి పాల్గొన్నారు.

పాయకరావుపేట : శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, ఆర్‌వి రత్నం, యస్ సీతారామయ్య, ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎ శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారి వి కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం :స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీ విద్యార్థులకు సచ్చాంధ్ర స్వర్ణాంధ్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి ప్రభాకర్ పర్యవేక్షించారు.

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో ముగ్గుల పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు 50 మంది పాల్గొన్నారు.విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ఇస్తామని వరహామణి తెలిపారు.

నక్కపల్లి : చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ జనార్ధన ఆధ్వర్యంలో పర్యావరణ- పరిరక్షణ, పరిసరాలు పరిశుభ్రతపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. హెచ్ఎంలు బాలాజీ, బి. శివప్రసాద్, పి నాగేశ్వరరావు, హైస్కూల్ పిడి షహనాజ్ ఈ పోటీలను పర్యవేక్షించారు.

నక్కపల్లి గ్రంథాలయంలో లైబ్రేరియన్ గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు.

మాడుగుల: మాడుగుల శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎడ్ల వెంకటేశ్వరరావు, కెజె.పురం గ్రంథాలయంలో అటెండర్ శృతి ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించారు.

గొలుగొండ: స్థానిక శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.వరలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రస్తుత సమాజంపై సెల్‌ఫోన్ ప్రభావం అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు ఉపాధ్యాయులు రామ్‌కుమార్, గోపికృష్ణ పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ రాజుబాబు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమ నాయకులకు నివాళి, గ్రంథాలయాలు ప్రయోజనాలు అంశంపై డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం శేషగిరిరావు, సిఆర్‌పి సతీష్,ఉపాధ్యాయులు మహేష్, రేవతి, ఉమాదేవి పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురం శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనాన్ని కళారత్న సుంకర చలపతిరావు ప్రారంభించారు. విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడుతూ, కవులకు ఆదరణ కోసం అన్ని గ్రంథాలయాలలోనూ కవి సమ్మేళనాలను నిర్వహిస్తున్నామన్నారు. పలు కవితలను వినిపించారు. అద్దంకి రాఘవాచార్యులు, డాక్టర్ దేవులపల్లి పద్మజ, రావులపల్లి రామలక్ష్మి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్ర లేఖనం, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ మహేష్, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, మైలపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, దేశభక్తి గేయాల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.త్రినాథరావు, టి.సునీత, లైబ్రేరియన్ బివిఎస్.అప్పారావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి నక్కపల్లి :మండలంలో ప్రాథమిక, ఉన్నతపాఠశాలల విద్యార్థులు తమ ఆధార్‌లో తేడాలుంటే తల్లిదండ్రుల సమక్షంలో సరిచేయించుకోవాలని మండల విద్యాశాఖాధికారి-2 రుత్తల నాగన్నదొర అన్నారు. మంగళవారం ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు స్థానిక బాలుర, గురుకుల పాఠశాల, గొడిచర్ల హైస్కూల్‌లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సోమవారం నుండి ప్రత్యేక ఆధార్ నమోదు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు ఇప్పటివరకు 70 మందికి ఆధార్ సవరణలు చేశారని, మిగిలిన వారు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆధార్ డిజిటల్ అసిస్టెంట్ సిహెచ్.నవ్యదీప్తి పాల్గొన్నారు.

కొమిరలో స్వమిత్వ గ్రామసభ

ప్రజాశక్తి- రావికమతం: సమిత్వ యాజమాన్య హక్కు పత్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ మహేష్ సూచించారు. మంగళవారం కొమిర సచివాలయం వద్ద సర్పంచ్ గొర్లె రవికుమార్ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మహేష్ మాట్లాడుతూ కొమీర గ్రామకంఠంలో నిర్మించుకున్న ప్రతి ఇంటి సర్వే వివరాలు గతంలో గృహ యజమానులకు అందజేశామని, వాటిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలనికోరారు. అభ్యంతరాలు లేని ఇళ్లకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. గ్రామంలో 186 ఇళ్లకు సర్వే నిర్వహించామని, సంబంధిత కుటుంబ యజమానులకు హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గొంతిన సత్తిబాబు, కరణం ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొంతలంలో పశువైద్య శిబిరం


పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని కొంతలం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం, పాడి రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య, రోలుగుంట పశువైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు, బుచ్చంపేట పశు వైద్యాధికారి దమయంతి, కొత్తకోట పశువైద్యాధికారి డాక్టర్ బాలతేజ, గ్రామ పెద్దలు హరిబాబు, కృష్ణ తదితరుల సమక్షంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 48 పశువులకు ఉచితంగా గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 13 పశు వులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 42 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు.

వార్షిక ప్రణాళిక బడ్జెట్ రూపకల్పనపై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి : 2026- 27 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ప్రణాళిక బడ్జెట్ రూపకల్పనపై నక్కపల్లి వెలుగు కార్యాలయంలో 8 మండలాల వెలుగు సిబ్బందికి నాలుగు రోజులు శిక్షణ ఎపిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ వరప్రసాద్, జిల్లా ఎపిఎం కల్యాణి హాజరై శిక్షణ ఇచ్చారు. మోడల్ మండలంగా ఎంపిక చేసిన మండలాల గ్రామ సంఘాల అధ్యక్షులతో పాటు సిబ్బంది భాగస్వామ్యంతో ఒక నిర్దిష్టమైన లక్ష్యం పెట్టుకుని, ఆ దిశగా వార్షిక బడ్జెట్‌ను తయారు చేసుకోవాలని సూచించారు. బడ్జెట్ రూపకల్పన విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో 8 మండలాల వెలుగు ఎపిఎంలు, సిసిలు, ఎసిలు, ఎంఎస్ అకౌంటెంట్స్ హాజరయ్యారు.


మాట్లాడుతున్నడిపిఎం వెంకటరమణ

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో నాగజ్యోతికి నాలుగు స్వర్ణాలు



నాగజ్యోతి

ప్రజాశక్తి-రోలుగుంట : అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఇంగ్లీష్ టీచర్ పివిఎం.నాగజ్యోతి నాలుగు బంగారు పతకాలు సాధించారు. ఈనెల 14 నుంచి భూటాన్‌లో నిర్వహించిన పోటీల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన నాగజ్యోతి, . 60 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందేల్లో రెండు బంగారు పతకాలను, డిస్కత్రో, పవర్ లిఫ్టింగ్‌లో చెరో బంగారు పతకాన్ని సాధించారు. నాగజ్యోతిని పలువురు అభినందించారు.

స్టూడెంట్ అసెంబ్లీకి చమ్మచింత విద్యార్థిని



స్నేహను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఎస్‌ఎంసి చైర్మన్

ప్రజాశక్తి- నాతవరం : నియోజకవర్గం నుంచి స్టూడెంట్ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా చమ్మచింత హైస్కూల్ విద్యార్థిని అప్పన స్నేహ ఎంపిక కావడంపై హెచ్‌కం కాశపు శివరాం ప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల26న అమరావతిలో నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలోస్టూడెంట్ మాక్ అసెంబ్లీ నిర్వహించనున్నారు. దీనిపై పాఠశాల, మండలస్థాయి, నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించగా, గత నెలలో మండల స్థాయి పోటీలో చమ్మచింత హైస్కూల్ విద్యార్థులు అప్పన స్నేహ, ఆర్.నవ్య ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. నర్సీపట్నం జడ్పీ హైస్కూల్ మెయిన్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో అప్పన స్నేహ మంచి ప్రతిభ కనబరిచి స్టూడెంట్ ఎమ్మెల్యేగా ఎంపికైంది. హెచ్‌ఎం శివరామప్రసాద్ ప్రోత్సాహంతో, గైడ్ టీచరు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రాంబాబు ప్రత్యేక శిక్షణలో స్నేహ స్టూడెంట్ ఎమ్మెల్యేగా ఎంపికవ్వడంపై ఎస్‌ఎంసి చైర్మన్ అప్పన అప్పారావు, గ్రామస్తులు అభినందించారు.

హెటిరో డైరెక్టర్‌కు సత్కారం



మోహనరావును సత్కరిస్తున్న బుజ్జి, తదితరులు

ప్రజాశక్తి - నక్కపల్లి : మండలంలో ఉపమాక శివాలయంలో కార్తీకమాసం పురస్కరించుకొని నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి హెటిరో యాజమాన్యం సహాయ, సహకారం అందించడం అభినందనీయమని నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. కార్తీక మాసం సందర్భంగా మూడు సోమవారాలు అన్న సమారాధనకు పులిహోరా, బియ్యంతోపాటు నాలుగో సోమవారం కంపెనీ యాజమాన్యం తరపున పూర్తిగా అన్న సమారాధన చేపట్టారన్నారు. అలాగే ఆలయానికి రంగులు, ఎస్ఎస్ గ్రిల్స్ ఏర్పాటు చేసి సహకరించారన్నారు అన్నసమారాధనకు సహకారం అందించిన హెటిరో గ్రూపు డైరెక్టర్ మోహనరెడ్డిని మంగళవారం శివాలయంలో దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరిం చారు. శివపార్వతులను దర్శించుకోగా, ఆలయ అర్చకులు సంతోష్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, హరి,నరిశే దిలీప్, వంగలపూడి నాని పాల్గొన్నారు.

61 మంది మత్స్యకారులతో కమిటీ

రాష్ట్ర హోంమంత్రి అనిత నేతృత్వంలో సిఎం చంద్రబాబును కలవనున్న బృందం



తహశీల్దార్‌కు కమిటీ జాబితాను ఇస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సూచన మేరకు బల్క్ డ్రగ్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మత్స్యకారులు, మహిళలు 61 మంది సభ్యులతో నూతనంగా ఏర్పాటు చేసుకున్న కమిటీ జాబితాను తహసిల్దార్ నరసింహమూర్తికి మంగళవారం మత్స్యకార నాయకులు అందజేశారు.వ ండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు ఆందోళన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 29న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాజయ్య పేటలో మత్స్యకారులు చేస్తున్న ఆందోళన శిబిరం వద్దకు వచ్చి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులంతా బల్క్ డ్రగ్ ఏర్పాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేయడంతో, హోంమంత్రి అనిత తన చేతుల్లో లేదని, మత్స్యకారులు ఒక కమిటీగా ఏర్పడితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకు వెళ్తానని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఇదిలా ఉండగా ఈనెల 3న నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో హోం మంత్రి అనిత గ్రీవెన్స్ నిర్వహించగా, మత్స్యకారులు బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని కోరుతూ మరోసారి వినతిపత్రం అందజేశారు. అప్పుడు కూడా ఆమె కమిటీగా ఏర్పడితే సీఎం వద్దకు తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న 52 మందితో కమిటీ ఏర్పాటు చేసి ఆర్‌డిఒ, తహశీల్దార్లకు జాబితాను అందించిన విషయం తెలిసిందే. అయితే మత్స్యకారులు మరోసారి సమావేశమై, మత్స్యకారులంతా ఒక నిర్ణయం తీసుకుని, మత్స్యకారులు, మత్స్యకార మహిళలతో కూడిన 61 మందితో నూతనంగా కమిటీని ఏర్పాటు చేసుకుని తహసిల్దార్ నరసింహమూర్తికి అందజేశారు. జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, ఎంపిటిసి పిక్కి సత్తయ్య, మత్స్యకార నాయకులు ఎర్రిపిల్లి నాగేష్, పిక్కి నూకరాజు, జామి అప్పలరాజు, బొంది చినతల్లి, గోసల సోమేశ్వరరావు, కారే వెంకటేష్, చొక్కా కాశీ, పిక్కి కోదండరావు పాల్గొన్నారు.

అల్లూరి పార్కును సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేటలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పార్కును గొలుగొండ మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం సందర్శించారు. అల్లూరి సమాధులకు నివాళి అర్పించారు. అల్లూరి చేసిన స్వాతంత్ర్య పోరాటాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దాసు, ఉపాధ్యాయులు భానోజీరావు, బాలకృష్ణ, ఉమా, అజ్మత్, రమణి పాల్గొన్నారు.



అల్లూరి సమాధులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నేర నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డిఐజి గోపీనాథ్ జెట్టి

ప్రజాశక్తి- నర్సీపట్నం : నర్సీపట్నం డిఎస్‌పి కార్యాలయాన్ని మంగళవారం మధ్యాహ్నం విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు, మీ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు రికార్డులను పరిశీలించి నేరాల నియంత్రణకు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కారం చేయాలని సూచించారు, అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గంజాయి నిర్మూలనకు అభ్యుదయం పేరుతో చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతం చేయడంపై సిబ్బందికి అభినందనలు తెలిపారు, ఇంతవరకు గంజాయితో సంబంధాలు ఉన్న 2500 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, 14 మంది నేరస్తుల ఆస్తులను జప్తు చేసినటు తెలిపారు, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు, కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు నిధులు

ప్రజాశక్తి -మాడుగుల : నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తెలిపారు. మాడుగుల మండలం ఎం. కృష్ణాపురం, చీడికాడ మండలం దండి సురవరం, కె.కోటపాడు మండలం చంద్రయ్యపేటలో పంచాయతీ భవనాలకు రూ. 96 లక్షలు, మాడుగుల మండలంలో 4, చీడికాడలో 6, దేవరాపల్లిలో 1, కె.కోటపాడులో 2 మొత్తం 13 చేతిబోర్లు నిర్మాణానికి రూ.13 లక్షలు, జాతీయ హెల్త్ మిషన్ నుంచి విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు మాడుగులలో 9, చీడికాడ 2, దేవరాపల్లి 1, కె.కోటపాడులో 4 మొత్తం 16 భవనాలకు రూ.26.06 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే బండారు తెలిపారు.

హెచ్‌ఎస్ఎల్‌ను సందర్శించిన ఆస్ట్రేలియా నిపుణుల బృందం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : భారతదేశం-ఆస్ట్రేలియా మధ్య రక్షణ సముద్ర సహకారాన్ని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడింది. న్యూఢిల్లీలోని కౌన్సిల్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ డిఫెన్స్ రీసెర్చ్, యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియాలోని డిఫెన్స్, సెక్యూరిటీ ఇనిస్టిట్యూట్ నుండి వచ్చిన 23 మంది అధికారుల నిపుణుల బృందం హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను మంగళవారం సందర్శించింది. ఈ ప్రతినిధి బృందానికి వైస్ అడ్మిరల్ అధిర్ అరోరా (రిటైర్డ్), డాక్టర్ గౌరవ్ సైనీ, డాక్టర్ ట్రాయ్ లీ-బ్రౌన్ నాయకత్వం వహించారు. హెచ్‌ఎస్ఎల్ తరపున డైరెక్టర్ కమాండర్ రాకేష్ ప్రసాద్, బృందానికి హెచ్‌ఎస్ఎల్ యొక్క అండర్ వాటర్ టెక్నాలజీలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, కీలక భవిష్యత్తు ప్రాజెక్టులు, షిప్‌యార్డ్ విస్తరణ ప్రణాళికల గురించి వివరించారు. సముద్ర భద్రత, సామర్థ్య అభివృద్ధి వంటి విస్తృతమైన అంశాలపై కూడా సహకారం అందించడానికి చర్చించారు.



షిప్‌యార్డు అధికారులతో సమావేశమైన ఆస్ట్రేలియా బృందం

సోంపురం గిరిజనులకు న్యాయం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని సోంపురం గిరిజనులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న అధికారులను డిమాండ్ చేశారు. గిరిజనులు సాగులో ఉన్న వివాదాస్పద భూములను గిరిజనులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైవాడ ప్రాజెక్టు నిర్మాణం జరిగినప్పుడు సోంపురం గ్రామానికి చెందిన గిరిజనులు భూములు, ఇళ్లు కోల్పోయారని తెలిపారు. కాని నేటికీ గిరిజనులకు పూనరావాసం కింద ఇళ్లు ఇవ్వలేదన్నార. నాడు ప్రభుత్వం భూసేకరణ చేసినప్పుడు గిరిజనులకు సరైన ప్యాకేజీ ఇవ్వకుండా భూములు బలవంతంగా లాక్కుందని, అయినప్పటికీ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని గిరిజనులు భూములు త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రాజెక్టు అవసరాలకు వాడుకోగా మిగిలిన కొద్దిపాటి భూముల్లో గిరిజనులు పంటలు వేసుకుని ఉపాధి పొందుతుంటే ఇతర పంచాయతీకి చెందిన కొంత మంది ఇక్కడి గిరిజనులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములపై రైతులకు ఎటువంటి అధికారం లేకపోయినా, కొంత మంది వారిని రెచ్చగొట్టి గిరిజనులపై ఘర్షణలకు పురిగొల్పుతున్నారని తెలిపారు. ఒకప్పుడు ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన గిరిజనులకే మిగులు భూమిపై పూర్తి హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భూముల్లో ఎటువంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకొని, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాధిత గిరిజనులు పాల్గొన్నారు.



భూములను పరిశీలిస్తున్న సిపిఎం నేత వెంకన్న